

పదిమంది ఎస్ఐలకు బదిలీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో పదిమంది ఎస్ఐలకు బదిలీలు జరిగినట్లు గురువారం ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ ఎస్ఐ ఎం.జగదీష్‌నాయుడు సీతంపేటకు, సీతానగరం ఎస్ఐ కె.నీలకంఠం కొమరాడకు, గరుగుబిల్లి ఎస్ఐ ఎం.రాజేష్ సీతానగరానికి, సీతంపేట ఎస్ఐ ఎ.నీలకంఠంను నీలకంఠాపురం, నీలకంఠాపురం ఎస్ఐ డి.అనిల్‌కుమార్ దోనుబాయికి, పార్వతీపురం ఒన్ టౌన్ ఎస్ఐ పి.దినకర్ రూరల్ స్టేషన్‌కు, అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న వై.సింహాచలాన్ని జిల్లా ఎస్‌బి కార్యాలయానికి, దిశా ఎస్ఐ బి.లావణ్యను పార్వతీపురం టౌన్1కు, విఆర్‌లో ఉన్న బి.రవీంద్రరాజును దిశాకు, ఎస్‌బి ఎక్స్‌లో పనిచేస్తున్న ఎన్.జగదీష్‌ను పిసిఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వెంగళరాయసాగర్‌లో తగ్గిన నీరు



రబీకి సాగునీరు కరువే

- కొనసాగుతున్న కాలువల ఆధునీకరణ పనులు
- ఈ ఏడాది 20 శాతం మాత్రమే పూర్తి

సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది రబీకి సాగునీటి సరఫరా కష్టంగానే ఉంది. వర్షాభావం ఒక కారణమైతే, కాలువల ఆధునీకరణ మరో కారణంగా కావడంతో రబీసాగు రైతుకు శాపంగా మారింది. దీంతో రైతులు రబీసాగు పట్ల ఆశలు వదులుకున్నారు.

ప్రజావక్తి - మక్కువ

మక్కువ మండలంలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు వెంగళరాయసాగర్ నుండి రబీ వరి సాగు కోసం సాగునీరు రావడం కష్టమేనని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు ఆధునీకరణ కోసం సుమారు రూ.60.5 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా ఈ ఏడాది కుడి ప్రధాన కాలువలో 20 శాతం మేరకు లైనింగ్ పనులు పూర్తి చేశారు. ఖరీఫ్ కాలం రావడంతో ఆ పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేసే సమయంలో ఈ ఏడాది నవంబర్ 15 వరకు మాత్రమే ప్రాజెక్టు నుండి సాగునీరు విడుదల జరుగుతుందని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే తీవ్ర వర్షాభావం నెలకొనడంతో ఇంకా బొబ్బిలి మండలంలోని శివారు ఆయకట్టు భూములకు సాగునీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఇంకా నీరు విడుదల కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు పదివేల ఎకరాల వరకు రబీ పంటకు సాగునీరందించేందుకు అవసరమయ్యే నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకా ఖరీఫ్ కొనసాగుతున్నందున ఇప్పట్లో రబీ సాగునీరు ప్రస్తావన అధికారుల్లో రానట్లు తెలుస్తోంది. సుమారు 24,800 ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం ఆయకట్టుకు ఉన్నప్పటికీ కాలువలు సరిగ్గా లేకపోవడంతో ఖరీఫ్ కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఈసారైనా జైకా నిధులతో కాలువల పనులు పూర్తి చేస్తే పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందగలదన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతుంది

ఆక్విడెక్టుకు మోక్షం కలిగేనా..?

ఎడమ ప్రధాన బ్రాంచ్ కాలువ పరిధిలోని గోముఖి నదిపై ఆక్విడక్ట్ నిర్మాణం జరిగి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. కోట్లాది రూపాయల నిధులతో చేపడుతున్న ఆధునీకరణలో భాగంగా ఆక్విడెక్టు నిర్మాణానికి ప్రతిపాదన ఉండడం ఈ ఆయికట్టు రైతుల్లో ఆశలు చిగురింప చేస్తుంది. కొన్ని ఏళ్లగా సుమారు 4,500 ఎకరాలు ఆయకట్ట రైతులకు చుక్కనీరు అందని పరిస్థితి. ఇందులో కొంత భాగం లింకు చానల్ ద్వారా నీటి సరఫరా జరిగినా అది అంతంత మాత్రమేనని రైతులు ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి గోముఖీ నదిపై ఆక్విడెక్టు నిర్మించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రబీకు సాగునీరు కష్టమే

పాచిపెంట : మండలంలోని పెద్దగెడ్డ జలాశయం ద్వారా రబీకి సాగునీరివ్వడం కష్టమేనని ఇరిగేషన్ అధికారులు తేల్చి చెబుతున్నారు. ప్రధానంగా వర్షాభావం వల్ల నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడమే. జలాశయం పూర్తి నీటిమట్టం 213.8 మీటర్ల కాగా, ప్రస్తుతం 208 మీటర్లు నీటిమట్టం ఉంది. రానున్న రోజుల్లో నీటిమట్టం పూర్తిగా తగ్గే అవకాశాలుండడంతో రబీకి సాగునీరివ్వడం కష్టమేనని డిఇఇ పి.కనకారావు తెలిపారు. రైతులు మాత్రం రబీకి సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఈ జలాశయం ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాల పరిధిలోని 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జలాశయం ఆధునీకరణ పనులు జరగకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు శివారు భూములకు నీరు సక్రమంగా అందలేదని రైతులు వాపోతున్నారు. ఆధునీకరణ పనులు ప్రారంభించి మూడేళ్లయిన 30 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడంతో సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల గుత్తేదారులు పనులు వేగవంతం చేయడం లేదు. అలాగే జైకా నిధులు మళ్లింపులు జరిగాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది పెద్దగెడ్డ జలాశయం ద్వారా రబీకి సాగునీరు కష్టమే.

27 నుంచి కుల గణన

- వివరాలకు పూర్తి రక్షణ
- సంక్షేమ పథకాల మంజూరుకు సంబంధం లేదు
- కుల గణన ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కాదు



మండలాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కులగణన ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. కులగణన ప్రక్రియపై గురువారం స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుంచి జిల్లా, మండల అధికారులతో వర్చువల్ గానూ, కుల సంఘాలతో ప్రత్యక్షంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులగణన వల్ల సంక్షేమ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. కుల గణనలో సేకరించాల్సిన వివరాలపై ప్రభుత్వం ప్రశ్నావళి రూపొందించిందని పేర్కొన్నారు. సచివాలయం యూనిట్‌గా సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల సహకారంతో కుటుంబాల నుంచి వ్యక్తిగత సమాచారం, సామాజిక హోదాకు సంబంధించిన సమాచారం సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమాచారాన్ని ప్రజలు స్వచ్ఛందంగా తెలియజేయవచ్చని అన్నారు. ప్రజలు తెలిపిన సమాచారానికి సంబంధించి ధ్రువీకరణ అవసరం లేదని తెలిపారు. ప్రజల నుండి సేకరించిన సమాచారం గోప్యంగా జరుగుతుందని, సమాచారం ప్రభుత్వం వద్ద పూర్తి రక్షణలో ఉంటుందని స్పష్టం చేశారు. కుల గణన సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాల తొలిగింపు ఉండదని స్పష్టం చేశారు. అలాగే కుల గణనకు కులధ్రువీకరణ పత్రాలు జారీకి కూడా సంబంధం లేదన్నారు.

20 నుంచి కుల గణనపై అవగాహన

కుల గణనపై ఈనెల 20 నుండి 25 వరకు ఇంటింటికీ వాలంటీర్లు వెళ్లి అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. కులగణన వల్ల సంక్షేమ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలుకు అవకాశం ఏర్పడుతుందనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8ఏళ్లలోపు గల పిల్లలకు ఇకెవైసి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆధార్ ఆధారిత అధీకృత ఉంటుందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఉంటే వారు వచ్చేలా చూడాలని సంఘం నాయకులను కోరారు.

మూడు స్థాయిలో ఇకెవైసి చేయాలి

కులగణన ఈనెల 27 నుంచి ప్రారంభమై వారం రోజుల్లో పూర్త వుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి కె.రామచంద్ర రావు అన్నారు. కుల గణన ఆన్ లైన్ విధానంలో మాత్రమే జరుగుతుందని చెప్పారు. సచివాలయం యూనిట్‌గా జరుగుతుందని, సచివాలయం పరిధిలో సచివాలయం సహాయకులు, వాలంటీరు ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరిస్తారని తెలిపారు. ఇందుకు ఆన్‌లైన్ యాప్‌లో ప్రభుత్వం వద్ద ఉన్న సంబంధిత కుటుంబాల వివరాలు ముందస్తుగానే కొంత మేర పొందుపర్చనున్నట్టు తెలిపారు. ఈ వివరాలతో పాటు మరి కొన్ని వివరాలు సేకరిస్తామన్నారు. ఒక కుటుంబంలో వ్యక్తులంతా మరణించినా చుట్టు పక్కల వారి నుండి వివరాలు సేకరించి ఇకెవైసి చేయాలని సూచించారు. ఆన్ లైన్ యాప్ లో సిఎఫ్ఎంఎస్ విధానంలో లాగిన్ కావాలని, ఏ ఫోన్‌లో లాగిన్ అయితే అదే ఫోన్ కుల గణన పూర్తి అయ్యే వరకు వినియోగించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డిఒలు కె.హేమలత, ఎం.లావణ్య, డిపిఒ బలివాడ సత్యనారాయణ, సిపిఒ పి.వీర్రాజు, గిరిజన, సాంఘిక, బిసి సంక్షేమశాఖల డిడిలు కె.శ్రీనివాసరావు, ఎం.డి.గయాజుద్దీన్, ఎస్.కృష్ణ, దాసరి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ రంగుముద్రి రమాదేవి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి నాగమణి, తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట రమణ, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ లాడి మెహర్ ప్రసాద్, షెడ్యూల్ కులాల ప్రతినిధులు సవరపు రామారావు, డి.శాంతిరాజ్, షెడ్యూల్ తెగల ప్రతినిధులు ఎ.చంద్ర శేఖర్, రొబ్బ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గురుకుల పాఠశాలను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పలువురు అధికారులకు పాఠశాలల ప్రత్యేక అధికారులుగా నియమించిన నేపథ్యంలో మల్లి గురుకుల పాఠశాలను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సరైన ప్రణాళిక రూపొందించాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. బాగా చదివి నైపుణ్యాన్ని ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోనుబాయి ఆశ్రమ పాఠశాల ఎపిఒ తనిఖీ

దోనుబాయి ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి గురువారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్‌గా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకొన్నారు. వారి విద్యా సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కెసుబ్బారావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

గిరిజన విద్యార్థులను వెంటాడుతున్న జ్వరాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలల గిరిజన విద్యార్థులను జ్వరాలు వెంటాడుతున్నాయి. జ్వరాల బారిన పడిన పలువురు విద్యార్థులను స్థానిక పిహెచ్‌సిలో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే పాచిపెంట బాలికల మినీ గురుకులానికి చెందిన కొర్ర దుర్గ, మామిడి లక్ష్మి, మజ్జి భానుప్రియ, డి.రమ్య బాధపడుతున్నారు. అలాగే గిరిజన బాలిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన వెలగ నాగమణి, బడ్నాయిక వలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పంది రాము, పి.కోనవలస ఆశ్రమ పాఠశాలకు చెందిన తాడంగి సురేష్‌తో పాటు మరికొంతమంది విద్యార్థులు జ్వరాల బారిన పడి పాచిపెంట పిహెచ్‌సిలో వైద్య సేవలు పొందుతున్నారు.

ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6,7,8 లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లాలో జరుగుతున్న ఓటరు జాబితా తయారీ ప్రక్రియను వివరించారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి ఫారం6, 7, 8 తీసుకొని పరిష్కరిస్తామన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస పోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తామని, పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందనగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "0" ఇంటి నంబరు, ఒకే ఇంటి నంబరులో పది ఓట్లకు మించి ఉన్న వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, కె.ఆర్.సి.సి. డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు పాల్గొన్నారు.

18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు

18ఏళ్లు దాటిన ప్రతి యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో ఓటరు జాబితా సవరణపై తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. డిసెంబరు 5లోగా మొత్తం దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. డిశంబర్లో ఎన్నికల కమిషను ఉన్నతాధికారుల బృందం పర్యటన ఉందని, ఓటరు జాబితా తయారీలో లోపాలు గుర్తిస్తే బాధ్యులైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి కళాశాలలో 18ఏళ్లు దాటిన వారి వివరాలు తీసుకొని, ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదుచేయాలని తెలిపారు. ఓటరుగా నమోదు చేయకపోతే ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుంటామన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన, శాశ్వతంగా వలసపోయిన వారి పేర్లను వెంటనే తొలగించాలని, అలా చేయకపోతే సంబంధిత బిఎల్ఒ, సూపర్ వైజర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. బలిజపేట మండలంలో చనిపోయిన వారి పేర్లు ఎక్కువగా ఓటరు జాబితాలో ఉన్నట్లు గుర్తించామని,వెంటనే చర్యలు తీసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, కెఆర్‌సిసి.డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎం.లావణ్య, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, డిఆర్ఒ



ధర్నాలో పాల్గొన్న వాలంటీర్లు

బహుభాషా వాలంటీర్లు ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆదివాసీ మాతృ బహు భాషా వాలంటీర్లు గురువారం విజయవాడలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బుహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.డోంబు మాట్లాడుతూ ప్రతి ఏటా రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు రూ.5వేలు నుంచి రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఇమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా సవర భాష విద్యా వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18న మండల పరిషత్ సర్వసభ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18న జరుగుతుందని ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరు కావాలని కోరారు.



కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శాసనమండలి విప్ విక్రాంత్

త్వరగా కల్వర్టు నిర్మాణం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పాలకొండ

గారమ్మ కాలనీతో పాటు, మెయిన్ రోడ్డుకు వెళ్లకుండా అతి దగ్గర దూరాన్ని తగ్గించి పోతులగెడ్డ కల్వర్టు నిర్మాణం వీలైనంత త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని శాసన మండలి విప్ విక్రాంత్ పేర్కొన్నారు. గురువారం ఘటాలదెప్పివీధి, శెగిడి వీధి సెంటర్లకు సంబంధించిన పోతులగెడ్డ కల్వర్టు నిర్మాణానికి విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని ఘటాలదెప్పి వీధి నుండి, గారమ్మ కాలనీ, మెయిన్ రోడ్డును కలుపుతూ ఉన్న పోతుల గెడ్డ కాలువపై కల్వర్టు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకున్నామన్నారు. అతి త్వరలోనే కల్వర్టు నిర్మాణం చేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్‌ఛైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు నీలాపు శారదా శ్రీనివాసరావు, వెలమల మన్మధరావు, కడగల అనూరాధ వెంకటరమణ, తుమ్మగుంట అనూష శంకరరావు, తూముల కళావతి లక్ష్మణరావు, భాసూరు కాంతారావు, పల్లా ధనలక్ష్మిభాను, దుప్పాడ పాపి నాయుడు, కొంచాడ అరుణ్, కొరికాన గంగునాయుడు, కిల్లారి మోహన్, ఆకుల మల్లీశ్వరి కుమార్, కోరాడ రవి, కోరాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

22న జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 22న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాలిచ్చారని ఎంపిడిఒ జి.పార్వతి చెప్పారు. శుక్రవారం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. అదే రోజు నాగుల చవితి పండుగ కావడం తో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యే కార్యక్రమానికి పట్టణం, మండలాలకు చెందిన ప్రజలు వినతులతో హాజరవుతారు. అన్ని రకాల సమస్యలకు పరిష్కార వేదికగా నిర్వహిస్తున్న జగనన్నకు చెపుదాం కార్యక్రమాన్ని పండుగ రోజు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తడంతో వాయిదా వేశారు

ఏజెన్సీలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించడానికి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంపిడిఒ సాల్మన్ రాజు అన్నారు. రెండో రోజు సంకల్ప్‌యాత్ర కార్యక్రమంలో భాగంగా మారుమూల ప్రాంతాలైన కేదారిపురం, వంగర గ్రామాల్లో సభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచార రథం వీడియో ద్వారా ప్రజలకు వివరించారు. ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద రెండు లక్షల చెక్కును అందించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఆదయ్య, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ కోసం సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగుదేశం, జనసేన సమన్వయంతో పని చేయాలని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తామని ఆపార్టీల నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానికంగా ఉన్న హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నిమ్మక జయకృష్ణ, జనసేన నాయకులు నిబ్రం మాట్లాడుతూ రాష్ట్రం అన్ని విధాలా వెనుక్కి వెళ్లిపోయిందని, ప్రజలు చైతన్యమై రాష్ట్రాన్ని, ముందుతరాల భవిష్యత్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్నికల పొత్తుల్లో భాగంగా రెండు పార్టీలు సమన్వయంతో పని చేసి వైసిపిని గద్దెదించుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్నేన అప్పలనాయుడు, పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, జనసేన పార్టీ జిల్లా నాయకులు పేడాడ రామ్మోహన్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, పాలకొండ పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్, మండల అధ్యక్షులు గండి రామినాయుడు, వీరఘట్టం మండల పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, జనసేన నియోజకవర్గ నాయకులు గర్భాన సత్తిబాబు, భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచారకర్త తోక సంధ్యారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : తెలుగుదేశం, జనసేన పార్టీలు కుటుంబ సభ్యులు సమిష్టిగా కలిసి పనిచేసే కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. కురుపాంలో సాయిరాం గుడి మైదానం వద్ద టిడిపి, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కావున టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావడనికి అంతాకష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి ఉమ్మడి జిల్లాల జనసేన సీనియర్ నాయకులు లోకం ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు కెవి కొండయ్య, మధు, మద్రాపు పురుషోత్తం నాయుడు, దేవ కోటి వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోటీ చేయడం తో వైసిపి ఓటమి ఖాయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి చెప్పారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జనసేన నాయకులతో కలిసి టిడిపి నాయకులు సమావేశమయ్యారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి,పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు,మక్కువ మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్, పాచిపెంట మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, సాలూరు మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, మెంటాడ మండల సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, ముసలి నాయుడు, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గేదెల రిషి వర్ధన్, పట్టణ నాయకులు శివకష్ణ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను అడ్డుకునేందుకు టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళు న్నాయని చెప్పారు.



కురుపాం : సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

పఠనాశక్తి పెంపునకు గ్రంథాలయాలు దోహదం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకొని గ్రంథాలయాలు ఆలంబనగా అభివృద్ధి చెందాలని ఎపి గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులు టి.శివ కేశవరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో ప్రిన్సిపల్ జె.రామారావు అధ్యక్షతన జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానజ్యోతులని, వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తెర్లి రవి కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ గ్రంథాలయంలో...

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ధర్మారావు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితరులను స్మరించుకుంటూ వారి చిత్ర పటాలకు పలువురు పాఠకులు నివాళులు అర్పించారు.


వీరఘట్టం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: గ్రంథాలయాల వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగరాజు, వెంకట్రావు, గ్రంథాలయాధికారి టి వెంకటరావు విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం :స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మహర్షి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 మంది ఐదో తరగతి విద్యార్థులు చిత్రలేఖన పోటీలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్సార్ రంగనాథ్, పాతూరి నాగభూషణం, అద్దంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వి.అన్నాజీరావు, బి విజయలక్ష్మి, ఎం.రామకృష్ణ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: విద్యార్థులు గ్రంథాలయాలను సద్విని యోగం చేసుకోవాలని హిక్కిం వలస మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొట్నాన మురళీమోహన్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూల మాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు, పాఠకులు పాల్గొన్నారు.


పార్వతీపురం : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులు

పాచిపెంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎంఆర్ రంగనాథ్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితరులను స్మరించారు. స్థానిక సమతా స్కూల్ ఉపాధ్యాయులు శ్రీరాం మూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు మన్మథరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పాలకొండ: స్వాతంత్రోద్యమ సమయంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని ఉత్తరాంధ్ర జిల్లా ఎంప్లాయిస్ ఐక్యవేదిక కన్వీనరు నూతలపాటి భరత్‌భూషణ్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయోద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాధన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, అడ్మిన్ శివకృష్ణ, అరవింద్, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు విశ్రాంత గ్రంథాలయ అధికారి శ్రీరాములు పూల మాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.


పాఠశాల నిర్మాణాలను పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

నెలాఖరులోగా ఏకలవ్య నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - భామిని

మండల కేంద్రమైన భామినిలో రూ.12కోట్లతో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణ పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె గురువారం పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ప్రతి రోజూ జరిగేలా, వేగవంతం చేసి ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆమె వెంట డిఇ కృష్ణకుమార్, ఎఇలు ఉన్నారు.

రోడ్లు మరమ్మతులు చేయకుంటే ఆందోళన : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపైన ఉన్న పెద్దపెద్ద గోతుల వద్ద మరమ్మతు పనులు ఈనెల 20లోగా చేపట్టాలని కోరుతూ పార్టీలకతీతంగా ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున రాస్తారోకో చేస్తామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం నుండి కొమరాడ మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే అనేక మంది ప్రమాదాల బారినపడి క్షతగాత్రులవుతున్నారన్నారు. సమస్యపై ఇప్పటికే అధికారులకు వినతులు అందజేయడం, వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టామన్నారు. అయినా అధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈనెల 20లోగా పనులు చేపట్టాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


శిక్షణను ప్రారంభిస్తున్న ఎపిఒ మురళీధర్

జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూరివలసలో స్వయం సహాయక సంఘాలకు చెందిన, ఎంపిక చేసిన 35 మంది నిరుద్యోగ మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణను గురువారం ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బిఐ, ఆర్‌ఎస్.ఇ,టి.ఐ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలో మొట్ట మొదటి సారిగా ఈ జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కావున అభ్యర్థులు మంచిగా శిక్షణ తీసుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో జిసిసి డిఎం మహేంద్రకుమార్, ఎపిడి వై.సత్యం నాయుడు, ఎపిఎం పి.సురేష్, జిల్లా క్లస్టర్ సీసీలు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిపిఒ సత్యనారాయణ

డిపిఒ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతు నిర్వహించి ఉత్తీర్ణ శాతం పెంచేలా చర్యలు ఉండాలన్నారు. పక్కా ప్రణాళికలతో విద్యార్థులను చదివించి స్థిరపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎంఇఒ జి.సూర్యదేముడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు


రోడ్డుపక్కనున్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

బలిజిపేటలో రహదారి భద్రతా చర్యలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని బొబ్బిలి-బలిజిపేట, బలిజిపేట-రాజాం ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద రహదారి కనిపించకుండా అడ్డంగా ఉన్న మొక్కలను స్థానిక ఎస్సై ఎన్.ప్రశాంత్ కుమార్ తొలగించే ఏర్పాటు చేశారు. మలుపుల వద్ద మొక్కలు పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో బర్లి గ్రామం వద్ద మలుపులు ఉన్న ప్రాంతాల్లో రహదారి భద్రత చర్యలు చేపట్టడంతో రోడ్డు ప్రమాదాలను నివారించగలిగామన్నారు. అలాగే బలిజిపేట ప్రధాని రహదారిపై పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ట్రాన్స్ జెండర్లకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి ట్రాన్స్ జెండర్‌కు హెచ్ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన ఉండాలని వైడిఒ నెట్వర్క్ ఔట్రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. గురువారం కురుపాంలో ట్రాన్స్ జెండర్లతో కలిసి హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం 40 మంది ట్రాన్స్ జెండర్లకు హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి డిసెంబర్ 1 వరకు యువత, ట్రాన్స్ జెండర్లకు , ఫిమేల్ సెక్స్ వర్కర్లకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పించి హెచ్ఐవి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్లు వై డి ఓ నెట్వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

పింఛను మంజూరు చేయండి

అధికారులను వేడుకొంటున్న డయాలసిస్ రోగి

ప్రజాశక్తి -బెలగాం

తనకు పింఛను మంజూరు చేయండి మహాప్రభో అంటూ కొమరాడ మండలం మసిమండ పంచాయితీ పెదపేడుంకు చెందిన డయాలసిస్ రోగి కొండ గొర్రె సుబ్బారావు అధికారులను వేడుకుంటున్నాడు. డయాలసిస్ చేయించుకోడానికి గురువారం స్థానిక జిల్లాకేంద్రాసుపత్రికి వచ్చిన విలేకరులతో ఆయన మాట్లాడారు. 8 నెలల క్రితం తాను అనారోగ్యానికి గురవ్వగా, వైద్యులను సంప్రదిస్తే డయాలసిస్ అవసరమని వైద్యులు తెలిపారని చెప్పారు. దీంతో వారంలో రెండురోజులు జిల్లా కేంద్రాసుపత్రికి వచ్చి డయాలసిస్ చేసుకుంటున్నట్టు తెలిపాడు. డయాలసిస్ చేయించుకోడానికి వారానికి రూ.4వేలు వరకు ఖర్చు అయ్యే పరిస్థితి నెలకొందని, నిరుపేదనైన తనకు ఇంత పెద్దమొత్తంలో ఖర్చు ఎంతో భారంగా ఉందన్నారు. ఇప్పటికే అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొనడంతో డయాలసిస్ సంబంధించిన రోగికి ఇచ్చే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపాడు. డయాలసిస్ మేనేజర్ నిర్లక్ష్యం వల్ల 8నెలలుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన పెన్షన్ మంజూరు కాకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే సుబ్బారావుకు పెన్షన్ మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నారు. సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ సుబ్బారావు తక్షణమే పింఛను మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

న్యుమోనియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - బెలగాం

పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను గుర్తించి, నివారణా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు 14వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన న్యుమోనియా తదితర శ్వాస సంబంధమైన వ్యాధుల నియంత్రణకు సంబంధించిన సాన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో సంభవించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో న్యుమోనియా తీవ్రమైందని, వ్యాధి లక్షణాల్లో ముఖ్యంగా జలుబు, దగ్గు అధికంగా ఉండి త్వర-త్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు పక్కటెముకులు కదలడం, అధికంగా జ్వరం రావడం, శ్వాస తీసుకునే సమయంలో శబ్దం రావడం, ఏమీ తినకపోవడం, తాగకపోవడం, అధికంగా నిద్రపోవడం మొదలగు లక్షణాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. వాతావరణంలో మార్పులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండడం, పౌష్టికాహారం సరిగా తీసుకోని పిల్లల్లో న్యుమోనియా అధికమవుతుందన్నారు. న్యుమోనియా నుండి సురక్షితంగా ఉండాలంటే బిడ్డ శరీరాన్ని బట్టలతో పూర్తిగా కప్పి ఉంచాలని, ఇంటిలో పొగ లేకుండా చూసుకోవడం, కిటికీలు తెరచి ఉంచడం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోనే ముర్రుపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేసి పిల్లల్లో న్యుమోనియా నివారణ చర్యలు చేపట్టి ఆరోగ్యవంతమైన బాల్యాన్ని వారికి అందేయాలని ఆయన కోరారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ పిసివి వ్యాక్సిన్ న్యుమోనియా నివారణలో కీలకమైనదని, ఖచ్చితంగా పీసివి టీకా మూడు డోసులు పిల్లలకు 6 వారాలు,14 వారాలు,9 నెలల వయస్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్ప, జయగౌడ్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రమాదేవి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ , ఆశా కార్యకర్తలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పిల్లల తల్లులకు సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

నేటి నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల పాఠశాలల్లోని ఈనెల17 నుంచి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గౌరవ దివస్ సందర్భంగా రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ ఆదేశాల మేరకు వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్ త్రో విభాగాల్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 17న పాఠశాల స్థాయిలో, 18న క్లస్టర్ స్థాయిలో, 20న ఐటిడిఎ స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. వీటిలో గెలుపొందిన వారికి 23న రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులంతా పాల్గొనాలని సూచించారు. పోటీలకు అవసమయ్యే అన్ని రకాల ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పెద్దూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయ పరిధి పెద్దూరు గిరిజన గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీలకు, మధుమేహ, రక్తపోటు, బాలింతలు తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ ఆనందరావు

15 ఏళ్లు దాటిన వారంతా క్రీడలకు అర్హులు

ప్రజాశక్తి - వీరఘట్టం

డిసెంబరు 15వ తేదీ నుండి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు 15 ఏళ్లు దాటిన వారంతా పోటీలకు అర్హులని ఎంఇఒ ఆర్.ఆనందరావు వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన క్రీడాకారులను వాలంటీర్ ద్వారా గుర్తించి రిజిస్ట్రేషన్ చేసేందుకు చొరవ చూపాలన్నారు. డిసెంబర్ 15 నుంచి 19 వరకు సచివాలయాల పరిధిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ షటిల్ బ్యాట్మెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే 21నుంచి వీరఘట్టం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆసక్తి గల ప్రతి క్రీడాకారుడు పోటీలో పాల్గొనేలా వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎం.రామకృష్ణ, ఎస్ఎంఇ ఎస్ ఉమామహేశ్వరరావు, ఎస్ పద్మరాజు, కె.సాల్మన్‌రాజు, పోలిరాజు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, కావున రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, నాయకులు బి.శ్రీరాములునాయుడు అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట సచివాలయం పరిధిలో వైనీడ్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువ: రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి అధికారంలోకి రావాలని జెడ్‌పిటి సభ్యులు మావుడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చెముడు పంచాయతీలో వైసిపి జెండా వందనను ఆవిష్కరించారు. సర్పంచ్ బొంగు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి మళ్లీ వైసీపీ ప్రభుత్వం ఎందుకు అధికారంలోకి రావాలో అన్న అంశంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు రంగునాయుడు, భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో గురువారం నిర్వహించిన వాహనతనిఖీల్లో భాగంగా శివాలయం వద్ద వంగర మండలం కిజ్జంగికి చెందిన వేమిరెడ్డి జగదీశ్వరరావు అక్రమంగా తరలిస్తున్న 39 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈయనపై కేసు నమోదు చేశామన్నారు.

అధికారులు జవాబుదారీగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - భామిని

ప్రస్తుత పారదర్శకత పాలనలో అధికారులు చెప్పే అంశం పట్ల జవాబుదారీగా వ్యవహారించాలని, ఆచరణలో అధికారులు స్పష్టం చేయాలని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తోట శాంతికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో వర్షాల్లేక, నీటి సదుపాయాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పంటలు పూర్తి స్థాయిలో నాశనమయ్యాయని, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా ఎంఎల్ఎ చొరవ చూపాలని తెలిపారు. మండలంలోని సింగిడి నుండి బత్తిలి వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉండి, ప్రతిసారి ప్రమాదాలకు కారణంగా ఉంటున్నాయని, రోడ్డు మంజూరైన కాంట్రాక్టర్లు నిర్మాణానికి ముందుకు రాడటం లేదు అని, ఈ అంశంపై ఎంఎడె దృష్టి సారించాలని మండల ప్రేత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం తెలిపారు. అలాగే హౌసింగ్ అంశంలోనూ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందించలేకపోతున్నామని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరయ్యేలా అధికారులు చొరవ చూపాలని ప్రజా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి చిన్నమ్మి, డిప్యూటీ తహసీల్దార్ శేఖరం, కొత్తకోట ఆంజనేయులు, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్, ఎపిఒ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం ద్వారా వస్తున్న దిగుబడిని చూపుతున్న మహిళా రైతు సావిత్రి

ఆనంద నిలయంగా 'మాతోట '

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయఘడ జమ్ముకు చెందిన పువ్వుల సావిత్రి తనకున్న ఎనిమిది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 3.50 ఎకరాల్లో శ్రీ వరి సాగు, ఒక ఎకరాలో మా తోట, మరో ఎకరాలో చిరుధాన్యాలు, పోడులో జీడి పంటలతో సాగు చేస్తున్నారు. అంతర్ పంటలుగా రాగులు సాగు చేస్తున్నారు. నాబార్డు సహకారంతో జట్టు పర్యవేక్షణలో మామిడి, నిమ్మ, జామ, సపోటా బత్తాయి, టేకు మొక్కలు వేశారు. ప్రకృతి వ్యవసాయంలో వేసిన పంటలు మంచి దిగుబడిని ఇస్తున్నాయని, అధిక ఆదాయం పొందడానికి వీలుంటుందని రైతు సావిత్రి తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భామిని

వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు పంపిణీకి గుర్తింపు నిమిత్తం హైదరాబాద్ అలీమ్ కో-సంస్థ ఏర్పాటు చేసిన గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ విశ్వాసారాయి కళావతి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అలికం కో సంస్థ విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు గుర్తింపు నిమిత్తం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల పేర్లు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని, ఏమైనా డాక్యుమెంట్ లేకపోతే తర్వాత ఇచ్చేలా అవకాశం కల్పించి నమోదు చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సూచించారు. ఈ శిబిరానికి పాలకొండ నియోజక వర్గంలోని పలు మండలాల నుండి తమ పేర్లను విభిన్న ప్రతిభావంతులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ, పిఒ విభిన్న ప్రతిభ వంతులు ముచ్చటించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులశాఖ ఎడి కవిత పాల్గొన్నారు.


వికలాంగులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ

చిరుధాన్యాల సాగు పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకొని చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేపడుతున్న రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు పంపిస్తే మంచి మద్దతు ధర వస్తుందని, అన్ని రకాల చిరుధాన్యాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. మండలంలోని శతాబి, తంగలం, మూటకూడు గ్రామాల్లో పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. రాగులు క్వింటాకు రూ.3846, తెల్లజొన్న క్వింటా రూ.3225 మద్దతు ధర ఉందని రైతులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరిగేలా చూసుకోవాలని గ్రామ వ్యవసాయ సహాయకులంతా ఈ విషయాలను రైతులకు తెలియజేయాలని తెలిపారు. శతాభి గ్రామ సర్పంచి శిలపజన్ని రామయ్య మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఎకరాకు నాలుగు క్వింటాళ్లు రావాల్సిన చోడి దిగుబడి 1.5 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని రాబోయే ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాలు అధిక సాగు, ఉత్పత్తికి ప్రోత్సహించాలని అన్నారు. ప్రకృతి సేద్య సిబ్బంది ద్వారా మరింత ప్రోత్సహించాలని, ధర కూడా ఎక్కువగా ఉండేలా చూడాలని కోరారు. అలాగే కాఫీ పంటల సాగు లాభదాయకంగా ఉందని, దీన్ని కూడా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ కుమార్, ప్రకృతి సేద్య ఎల్ టు సి ఆర్ పి సురేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.


శతాబిలో రాగిపంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు